క్లుప్తంగా

కార్యకర్తల సమస్యలు పట్టించుకోరా?

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం బీసీ కుల స్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరం. దరఖాస్తు చేసుకున్న 10 రోజులకు కూడా ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఓ కార్యకర్త ఆదివారం పార్టీ అల్లాదుర్గం గ్రూప్‌లో ఆవేదనతో పోస్టు చేశారు. నాయకులకు సేవ చేస్తున్న కార్యకర్తల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో అఖిలపక్షం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 84 రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం డివిజన్ ప్రకటించే వరకు తాము దీక్షలు విరమించమని అఖిలపక్షం ప్రతినిధులు పోచమ్మల అశ్విని, దొమకొండ యాదగిరి, దామోదర్ పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందచేత



చెక్కును అందజేస్తున్న సునీతారెడ్డి

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని అప్పాజీపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ శేఖర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య సహాయం కోసం హత్నూర మండలం బోర్పట్లలో జరిగిన కార్యక్రమంలో బాధితుడి కుటుంబ సభ్యులకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.30 వేల చెక్కును ఆదివారం అందజేసినట్లు జెడ్పీటీసీ మేఘమాల ఓ ప్రకటనలో తెలిపారు.

సర్పంచ్‌ల మోర్పట్ల సందర్శన



బోర్పట్లకు బయలుదేరిన సర్పంచ్‌లు

చిన్నశంకరంపేట(మెదక్): జల శుద్ధీకరణ సందర్శన కోసం ఆదివారం పాపన్నపేట మండల సర్పంచ్‌లు, కార్యదర్శులు బోర్పట్ల తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జగదీశ్వర్ చారి మాట్లాడుతూ.. ప్రాణాధారమైన తాగునీటిపై అందరికి అవగాహన కల్పించేందుకు ఈ ట్రిప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగన్, సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

నేటి విద్యా దినోత్సవం విజయవంతం చేయాలి

కౌల్దారం(నర్సాపూర్): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించే విద్యా దినోత్సవ వేడుకలను మండల వ్యాప్తంగా విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు విధిగా పాల్గొనాలని మండల విద్యాధికారి నీలకంఠం ఆదివారం అన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధి

- దూపదీప నైవేద్య స్కీమ్ అమలుతో అర్చకులకు లబ్ధి
- డీడీఎన్‌ఎస్ స్కీం జిల్లా అధ్యక్షుడు శాలక రాజేశ్వర శర్మ



రాజేశ్వరశర్మ

తూప్రాన్: పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని డీడీఎన్‌ఎస్ స్కీం జిల్లా అధ్యక్షుడు శాలక రాజేశ్వర శర్మ తెలిపారు. ఆదివారం ఆమె తూప్రాన్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దూపదీప నైవేద్యం స్కీం ద్వారా నెలకు గౌరవ వేతనంగా రూ.10వేలు అందిస్తుండటంతో జిల్లాలోని 93 మంది అర్చకులకు మేలు జరగనుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ స్కీంలో జిల్లాలోని అర్చకులందరికీ అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి బసవలింగప్ప, కోశాధికారి శీలం కోట ప్రవీణ్ శర్మ, సహాయ కార్యదర్శులు శ్యాంసుందర్, ప్రభులింగం అర్చకులు అహోబిలం ప్రవీణ్ కుమార్, కంటాయపాలెం వెంకటకృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



చేగుంట(తూప్రాన్): విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్ అధికారులు



శివ్వంపేట(నర్సాపూర్): బస్సును ప్రారంభిస్తున్న ఎంపీపీ హరికృష్ణ



రామాయంపేటలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

ఇంటింటికీ తాగు నీరు

- మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్
- జిల్లా వ్యాప్తంగా మంచినీళ్ల పండగ



మెదక్ మున్సిపాలిటీ: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్



మనోహరాబాద్(తూప్రాన్): వెంకటాపూర్ అగ్రహారంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



పెద్దశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

మెదక్ మున్సిపాలిటీ: భగీరథతో ఇంటింటికి నల్లా నీళ్లు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. ఆదివారం మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నీళ్ల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. గతంలో ప్రత్యేక రాష్ట్రం రాకముందు మహిళలు ఖాళీబిందెలు పట్టుకుని వీధుల్లోకి వెళ్లి పడిగాపులు కాసేవారని, నీటి కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారన్నారు. రాష్ట్రం వచ్చాక భగీరథ ద్వారా ఇంటింటికి తాగు నీరు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం మంచినీళ్ల పండగను ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వెనక భాగంలో ఉన్న మంచినీళ్ల ట్యాంక్‌ను పూలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ట్యాంక్ వద్ద ముగ్గులు వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రపు కొండల్‌రెడ్డి, మల్యాల కిషన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. 70 ఏళ్లలో జరగని అభివృద్ధి ఈ తొమ్మిదేళ్లలో జరిగిందని పేర్కొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): ఇంటింటికి తాగునీరు అందించి ఆడపడుచులకు నీటిపాట్లను లేకుండా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత అన్నారు. ఆదివారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వెంకటాపూర్ అగ్రహారంలో ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో సర్పంచ్ రేణుక, గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాటర్ ట్యాంక్‌ల వద్ద మహిళలు వేసిన రంగవల్లులను పరిశీలించారు. ఉత్తమ ముగ్గులు వేసిన వారిని సత్కరించి బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఆంజనేయులు, కార్యదర్శి సునంద, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల్లో మంచి నీళ్ల పండగను నిర్వహించారు. తాగునీటి కష్టాలు, భగీరథ ద్వారా పొందుతున్న ఉపయోగాలను ప్రజాప్రతినిధులు వివరించారు.



మనోహరాబాద్‌లో..



కొడిపల్లి(నర్సాపూర్): ర్యాలీ తీస్తున్న గ్రామస్తులు



తూప్రాన్: నర్సంపల్లిలో..



కౌల్దారం(నర్సాపూర్): సంగాయిపేటలో ..



చిన్నశంకరంపేట(మెదక్): జంగరాయిలో..



కొడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

జోరుగా మట్టి రవాణా



జేసీబీ సహాయంతో మట్టి తరలిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. అనుమతులే లేవని స్థానిక రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారే తప్ప.. తవ్వకాలు చేస్తున్న వారిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. చెరువులు, కుంటల నుంచి మట్టిని ఇటుక బట్టీలు, ప్రైవేట్ లే అవుట్‌లకు తరలిస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం మండలంలోని ఆరెగూడెం శివారులోని బషీర్ చెరువు నుంచి జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ల ద్వారా మట్టిని తరలించారు. ఈ విషయమై తహసీల్దార్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. అక్రమ మట్టి తరలింపు విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



నర్సాపూర్ రూరల్: పూజలు చేస్తున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన శ్రీ చాముండేశ్వరీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పక్కనే ఉన్న మంజీరా నదిలో భక్తుల స్నానం ఆచరించి, భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో వెలసిన కేతకి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం ఆలయ ఫౌండర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, అలంకరణ వంటి పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు హరిప్రసాద్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో ..

కొడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేశ్ పంతులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాలతో భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులకు మంచినీరు, వసతితో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

నార్సింగి పట్టణ వంజరి సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్



రామాయంపేట(మెదక్): నార్సింగి పట్టణ వంజరి సంఘం సభ్యులు ఆదివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడికె ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా దాలె అమరేందర్, ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు, శ్రీనివాస్, అముదరాజు, కార్యదర్శులుగా సిద్ధు, కృష్ణ, స్వామి, కోశాధికారిగా సొంగని మల్లేశం, గౌరవ సభ్యులుగా నారాయణ, భిక్షపతి, రాజు, రమేశ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొడికె పోచయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంకే రాజు, కాలేరు యోగి, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో మంచి భవిష్యత్



క్యాంపస్‌లో సెలక్షన్ అయిన విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): ఫార్మా రంగంలో మంచి భవిష్యత్ ఉందని హెట్రో ల్యాబ్ యూనిట్ కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేశ్, గ్లాండ్ ఫార్మా ప్రిన్సిపాల్ శివ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ఉన్న గ్లాండ్ ఫార్మా కాలేజీలో బీ ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులకు హెట్రో కంపెనీ క్యాంపస్ సెలక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మా రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. పట్టుదలతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. క్యాంపస్ సెలక్షన్‌లో 75 విద్యార్థులు పాల్గొనగా, 38 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

నార్సింగి బీఆర్‌ఎస్ ఎస్సీ కమిటీ కార్యవర్గం

రామాయంపేట(మెదక్): నార్సింగి పట్టణ బీఆర్‌ఎస్ ఎస్సీ కమిటీ అధ్యక్షుడిగా కూరాకుల యాదగిరిని నియమించారు. ఆదివారం జరిగిన మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బాబు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కనకయ్య, రాజు, ప్రధాన కార్యదర్శిగా పెద్ద పోచయ్య, కార్యదర్శులుగా కోనేరు నర్సింలు, పెద్ద భూమయ్య, కార్యవర్గ సభ్యులుగా ఎల్లయ్య, రాములు, పెద్ద మైసయ్య, పోచయ్య, చిన్న మైసయ్య, మల్లయ్య, సుధాకర్, నాగరాజు, ఉప్పలయ్యను ఎన్నుకున్నారు.

కేబుల్ వైర్లకు నిప్పు

మనోహరాబాద్ (తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ)లో మోత్కు శ్యామలకు చెందిన పొలంలో గుర్తు తెలియని దుండగులు బోరు పైపులు, కేబుల్ వైర్లను దహనం చేశారు. దీంతో తనకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులపై చర్యలు చేపట్టాలని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో గ్రామస్తుల సమష్టి కృషి



తూప్రాన్: చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో..

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో 364 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. ప్రతీ ఆదివారం గ్రామ అభివృద్ధిలో గ్రామస్తులు సమష్టిగా కృషి చేస్తూ భాగస్వాములు అవుతున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని 6వ వార్డులో నిర్వహించారు. పరిసర ప్రాంతాలను, సీసీ రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. అలాగే చెట్లకు పాదులు వేశారు. గ్రామంలో ఇప్పటివరకు నిరంతరాయంగా 364 వారాలుగా స్వచ్ఛభారత్ చేపడుతున్నామని సర్పంచ్ మహాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, పంచాయతీ కార్యదర్శి మహేందర్ రెడ్డి, ఐకేపీ వీవోఏ సంతోష, మేకిన్ యూత్ ఉపాధ్యక్షుడు శ్రీను, స్పెషల్ ఆఫీసర్ సురేశ్, పాలకవర్గ సభ్యులు, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. 270వ వారంలో భాగంగా పలు వీధుల్లో యువకులు స్వచ్ఛభారత్ నిర్వహించి పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్త చెదారాన్ని డంప్‌యార్డులకు తరలించారు.

మొక్కుబడిగా ఉత్సవాలు

అధికార పార్టీ నేతలే దూరం



అల్లాదుర్గంలో నీళ్ల పండగను సర్పంచ్, సిబ్బందితోనే నిర్వహించిన దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా జరుపుకోవాలని అధికారులను ఆదేశించింది. గ్రామాల్లో పండగ వాతావరణం కనిపించాలని, రూ.లక్షల నిధులు మాత్రం మంజూరు చేసింది. అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అల్లాదుర్గం మండలంలో దశాబ్ది ఉత్సవాలను మొక్కుబడిగా నిర్వహించారనే ఆరోపణలున్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రజల నుంచి స్పందన బాగానే ఉన్న ఎక్కువ పంచాయతీల్లో అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతలే హాజరు కాలేదు. ఆదివారం నిర్వహించిన నీళ్ల పండగకు స్పందన అసలే లేదు. అధికారులు సహితం పట్టించుకోలేదు. సెలవు కావడంతో అధికారులు హాజరు కాలేదు. గ్రామాలకు, మండలానికి ప్రత్యేక అధికారులను నియమించిన వారు ఎక్కడా కనిపించడం లేదు. కొందరు ఫొటోలు దిగి జిల్లా అధికారులకు పంపి ఘనంగా నిర్వహించినట్లు చెప్పుకుంటున్నారు. నీళ్ల పండగలో సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, కార్యదర్శి పాల్గొని నీటి సరఫరా చేసే సిబ్బందిని సన్మానించారు. దశాబ్ది ఉత్సవాలపై ప్రజల నుంచి ఏ గ్రామంలో స్పందన లేదు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కరాటే శిక్షణలో బెల్టులు పొందిన విద్యార్థులు

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాలకు చెందిన విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో భాగంగా ఇదే పాఠశాలలో చదివిన పైతర గ్రామానికి చెందిన మాస్టర్ మల్లేశం కరాటేలో ఉచితంగా శిక్షణ ఇస్తూ వస్తున్నారు. ఆదివారం మొదటి స్టేజిలో శిక్షణ పూర్తి చేసుకొని పరీక్షలో ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్ బెల్టులను రెంజుకి చోటో ఖాన్ ఫౌండర్, డైరెక్టర్ మాస్టర్ నగేశ్ బెల్టులను అందజేశారు. ఈ శిక్షణ పొందిన వారిలో ఎక్కువగా విద్యార్థినులు ఉండడం అభినందించదగ్గ విషయమని మాస్టర్ నగేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ మల్లేశం మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు శారీరక దారుఢ్యానికి మానసికోల్లాసానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమం ఉన్నత పాఠశాలలో నిరంతరంగా కొనసాగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణలు చేరాలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణయితలుగా మాస్టర్లు రవళి, రమేశ్ వ్యవహరించారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ రూరల్: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయిన కార్యకర్త కుటుంబీకులను ఆదివారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పరామర్శించి ఓదార్చారు. హవేళీఘనాపూర్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త మూగ ఏసురాజు శనివారం ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఏసురాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తక్షణ ఆర్థిక సాయం కింద అంత్యక్రియలకు రూ. 10వేలను అందజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మేకల సాయిలు, రామచంద్రరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఖాలేద్, పీఎసీఎస్ డైరెక్టర్ సిద్ధిరాంరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

జేఈఈలో గురుకులవిద్యార్థుల ప్రతిభ



లోహిత్ కుమార్



బి.వేణు



చిందోల్ హేమచంద్ర



కార్తీక్ యాదవ్

మెదక్ జోన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ లో మెదక్‌కు చెందిన విద్యార్థి అల్లాడి లోహిత్ కుమార్ 363 ఆల్ ఇండియా ర్యాంకు సాధించాడు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో లోహిత్ కుమార్ ఉత్తమ ర్యాంకు సాధించగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు అభినందనలు తెలిపారు. జెఈఈ మైయిన్స్ లో 1172 ర్యాంకు సాధించగా, ఎంసెట్ లో 406 ర్యాంకు సాధించాడు.

నర్సాపూర్: జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 ఫలితాలలో నర్సాపూర్‌లోని గిరిజన బాలుర గురుకుల కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని గిరిజన గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. గురుకుల కాలేజీకి చెందిన బి.వేణు 131 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 8628 ర్యాంకు సాధించాడని, స్థానికంగా ఎస్టీ విభాగంలో 75వ ర్యాంకు సాధించాడని ఆయన తెలిపారు. కాలేజీకి చెందిన మరో 16మంది విద్యార్థులు వివిధ ర్యాంకులు సాధించారని చెప్పారు. కాగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు సంపత్‌కుమార్‌తో పాటు కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది అభినందించారు.

రేగోడ్(మెదక్): రేగోడ్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు చిందోల్ హేమచంద్ర, గొల్ల కార్తిక్ యాదవ్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సత్తా చాటారు. హేమచంద్ర ఆలిండియా లేవల్లో 2876 ర్యాంక్ సాధించగా, కార్తీక్ యాదవ్ 3295 ర్యాంక్‌ను సాధించారు. ఇండియాలోనే ఉత్తమ ఐఐటీలో సీట్లు వచ్చే అవకాశం ఉందని విద్యార్థుల కుటుంబీకులు నందకుమార్, గొల్ల సంగమేశ్వర్ యాదవ్‌లు తెలిపారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి



బ్రిడ్జి కింది భాగంలో తేలిన ఇనుప చువ్వలు



తూప్రాన్ - నర్సాపూర్ హైవే పై బ్రిడ్జి

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి ప్రమాద భరితంగా మారింది. గతంలో ఉన్న వాహనదారుల అవసరాలకు అనుగుణంగా తూప్రాన్ – నర్సాపూర్ సింగిల్ రోడ్డుపై బ్రిడ్జి నిర్మించారు. ప్రస్తుతం పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా ఈ రోడ్డును హైవేగా మార్చారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. మగ్దుంపూర్ గ్రామ శివారు వద్ద నున్న బ్రిడ్జి కింద భాగంలో ఇనుప చువ్వలు తేలాయి. ప్రమాదం చోటు చేసుకోకముందు సంబంధిత హైవే అధికారులు ఇనుప చువ్వలు తేలిన బ్రిడ్జిని పరిశీలించి, మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయం గురించి హైవే ఏఈ రామకృష్ణ వివరణ కోరగా... ఇనుప చువ్వలు తేలిన బ్రిడ్జిని పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.